# అనుభవం

బేహరా ఉమామహేశ్వర రావు

వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రతిరోజూ పురాణ కాలక్షేపం పరిపాటి. నడివయస్కులు, వయసుమీరిన వృద్ధులు రిటైర్డు ఉద్యోగులు తప్పనిసరిగా చేరతారు హరికథ వినడానికి. పరంమాట ఎలా వున్నా, ఇహంకోసం అది నిత్యకృత్యం. రామాయణకథ పదకొండు రోజులై జరుగుతోంది. ఆరోజు సీతారామ కళ్యాణం ఘట్టం ముగిసింది.

కళ్యాణోత్సవం జరిపిస్తున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచుతున్నారు. ఆరోజు ఖర్చంతా జయరామయ్య భరించాడు. జయరామయ్య అంతా ముగించి బైటికి వచ్చాడు. ఎదురుగా సుందరం మాష్టారు కనిపించారు.

"మీరు! మీరు...సుందరం మాష్టారు కదూ!" అంటూ దగ్గరకు వెళ్ళాడు జయరామయ్య.

"అయ్యా! మీరు జయరామయ్యగారు..." ఆప్యాయంగా చేతులు పట్టుకున్నారు సుందరం మాష్టారు.

"మీరు ఇప్పుడు ఎక్కడ! ఏమిటి!" ఉక్కిరిబిక్కిరి అవుతూ ప్రశ్నించాడు జయరామయ్య.


"నేను కిందటి నెలలో రిటైర్ అయ్యాను. ఇక్కడ న్యూకాలనీలో పాక వేసుకుని ఉంటున్నాను" చెప్పారు సుందరం మాష్టారు.

"మా చెల్లెలు అలివేలు క్షేమమా మాష్టారూ!!" జ్ఞప్తికి తెచ్చుకుంటూ అడిగాడు జయరామయ్య.

"ఏదో మీ దయవల్ల..."

"నా దయ ఏముంది, అంతా ఆ పరమేశ్వరుడి కృప" అంటూ రెండు చేతులతో ఆ దేవుడికి నమస్కరించాడు జయరామయ్య.

"బాబూ!" విసుక్కుంటూ అరిచాడు కారుడ్రైవరు. జయరామయ్య కారుడ్రైవరువైపు తిరిగి, "నువ్వు వెళ్ళిపో. నేను మాష్టారితో మాట్లాడాలి. కోడలితో అరగంటలో వచ్చేస్తానని చెప్పు" అన్నాడు. కారు కదిలింది.




"కారుని పంపించేశారేం?" అడిగారు సుందరం మాష్టారు.

"నడుచుకుంటూ మీ ఇంటికి పోదాం" అన్నాడు జయరామయ్య.

"ఈ కుచేలుడి యింటికి శ్రీకృష్ణ పరమాత్ముడు అష్టైశ్వర్యాలతో తుల తూగుతున్న మీరు వస్తానంటే కాదంటానా?"

"మాష్టారూ! నాదో చిన్నకోరిక?"

"ఈ ఆ.పి.త. (ఆడపిల్లల తండ్రి) తమ కోరికను తీర్చగల సమర్థుడా!!??"

"అయ్యో ఎంత మాట! వివేకం తెలియని రోజుల్లో మిమ్మల్ని ఆడపిల్లల తండ్రి అని హేళన చేసేవాణ్ని. అది తలచుకుంటే నామీద నాకే అసహ్యం వేస్తుంది."

"సరే బావగారూ మీ కోరిక ఏమిటి చెప్పండి!"

"మాష్టారూ! తమవున విరిగిన అలుగులు అమవున షచ్ఛంగవచ్చు...సరే అది అటుంచండి. గతంలో మిమ్మల్ని ఎంత బాధపెట్టాను" నొచ్చుకుంటూ అన్నాడు జయరామయ్య.

"అటువంటిదేం కాదులేండి" సరి పుచ్చుకున్నారు మాష్టారు.

"మీ యింటికి వచ్చి, మా చెల్లెలు అలివేలుని చూస్తేగాని నా మనసు కుదుట పడదు" బొంగురుగొంతుతో అన్నాడు జయరామయ్య.

"సరే. మీ మాటను కాదంటానా బావగారూ!" అంటూ మాష్టారు కదిలారు. వెంట జయరామయ్య కదిలాడు.

"అలివేలూ! ఎవరొచ్చారో చూడు!" గట్టిగా అరిచారు సుందరం మాష్టారు. అలివేలు యింట్లోంచి వచ్చింది. ఎగాదిగా చూస్తూ "ఇరవై ఏళ్ళ క్రితం...

మనం ఏలా...నగరంలో పనిచేసే ఉప్పుడు ప్రక్కింటి తాహసీల్దారు అన్నయ్యగారు కదాండీ?" ప్రశ్నార్థకంగా అడిగింది.

జయరామయ్య ఆనందంతో తల ఊపుతూ "ఎంత చక్కగా గుర్తుపట్టా వమ్మా!" అన్నాడు.

"ఈయన తహసీల్దారు కాదు కలెక్టరు! కలెక్టరు!" చెప్పారు సుందరం మాష్టారు.

"ఇంకేం కలెక్టరు! రిటైర్ అయిపో తేమ" సముదాయించాడు జయరామయ్య

"రండి కూర్చోండి" అంటూ మంచం వేసింది అలివేలు.

జయరామయ్య మంచం మీద కూర్చుంటూ "క్షేమమా తల్లీ!" అంటూ ప్రశ్నార్థకంగా చూసాడు

"ఏదో మీ దయవల్ల" అంది అలివేలు.

"అన్నిటికీ ఆ దేవుని దయ...నన్ను మన్నిస్తావా అమ్మా?" పశ్చాత్తాపపడుతూ అన్నాడు జయరామయ్య

దేనికి అన్నట్లు ఆమె చూసింది.

"నా మగపిల్లల్ని చూసి గర్వపడు తున్న సమయంలో మిమ్మల్ని అ.పి.త. అంటూ నొప్పించేవాడ్ని. దీనికి క్షమా పణ ఉందా తల్లీ?" బాధగా అడిగాడు జయరామయ్య.

"ఉండండి అన్నయ్యగారూ! కాఫీ తెస్తాను" అంటూ ఇంట్లోకి వెళ్ళింది అలివేలు.

ఇల్లు పరిసరాలు చూస్తూ "ఎంత చక్కని ఇల్లు కట్టుకున్నారు మాష్టారూ!" అడిగాడు జయరామయ్య

"ఈ పేదవాడికి ఈ గుడిసే మహా భవనం బావగారూ!" సంతృప్తి కన బరుస్తూ అన్నారు మాష్టారు.

"ఇది కుటీరం బావగారూ! పూరి గుడిసె కాదు సరస్వతి తాండవిస్తున్న వర్ణశాల. భవనాల్లో వుండేవాళ్ళంతా సుఖపడుతున్నా రనుకుంటున్నారా?" అని ప్రశ్నించాడు జయరామయ్య. ఆ మాట వింటూనే సుందరంమాష్టారు నవ్వేసారు.


జయరామయ్య ఇల్లంతా కలయ చూసాడు. చుట్టూ మధ్యతరగతి కుటుం బీకులే. అటుగా పోతున్నవారంతా మాష్టార్ని పలుకరిస్తూ పోతున్నారు. తానుండే బంగారు పంజరం కంటే, సుందరం కుటీరమే మేలు అనిపించింది జయరామయ్యకు.

అలివేలు కాఫీ గ్లాసు జయరామయ్యకు అందించింది.

"ఎన్నాళ్ళకు నీ చేతి కాఫీ తాగు తున్నానమ్మా! ఇంతకీ బావగారికి?..." అంటూ జయరామయ్య మాష్టారివేపు చూసాడు.

"వారికి లేకుండానా అన్నయ్యా!" అంది అలివేలు.

అందరూ నవ్వేశారు. అలివేలు భర్తకు కూడా కాఫీ అందించింది.



"కాఫీ ఎలాగుంది అన్నయ్యగారూ?" సందేహిస్తూనే అడిగింది అలివేలు.

"బ్రహ్మాండం" సంతోషంగా అన్నాడు జయరామయ్య.

"ఇంట్లో పాలు లేవు. డబ్బాపాలు. ఏదో అభిమానంగా మీరు అలా అంటున్నారు గాని కాఫీ నిజంగా బాగుందా?"

"ఈ కాఫీకి కూడా మీ అన్నయ్య దూరం అయ్యాడు తల్లీ. ఆడపిల్లలందరికీ పెళ్ళిళ్ళు చేసేశావా అమ్మా?" ప్రశ్నార్థకంగా చూసాడు జయరామయ్య.

ఆ మాటకు సుందరం మాష్టారు అందుకుని "ముగ్గురికీ పెళ్ళిళ్లు అయిపోయాయి!" తేలిగ్గా చెప్పారు.

"అల్లుళ్ళు ఏం చేస్తున్నారు?"

"పెద్ద అల్లుడు స్కూలుటీచరు. రెండవవాడు టైలరు. మూడవ అల్లుడు బి.ఏ. ప్రస్తుతం థియేటరు గేటుకీపరు" ముభావంగా చెప్పారు సుందరంమాష్టారు.

"అదృష్టవంతులు. ఎవరి గుర్రానికి వారు గడ్డివేసుకుంటున్నారు" సంతృప్తి వ్యక్తపరుస్తూ అన్నాడు జయరామయ్య.

"మీ అబ్బాయిలేం చేస్తున్నారు అన్నయ్యగారు?" అడిగింది అలివేలు.

చిన్న నవ్వు పెదవులపై చిందించాడు జయరామయ్య.

"పెద్దవాడు డాక్టరు. చిన్నవాడు ఇంజనీరు" నిర్లిప్తంగా చెప్పాడు.

"ఏ పూర్వజన్మ పుణ్యమో అన్నయ్యగారూ! అవునట్లు కాంతం వదినగారు క్షేమమా?"

"ఆహా(..." జయరామయ్య తల గట్టిగా ఊపాడు.

"ఏం అలా అంటున్నారు? ఆశ్చర్య పడుతూ అలివేలు అడిగింది.

"ఏం చెప్పమంటావు చెల్లెలా? సుపుత్రులిద్దరూ మా యిద్దర్నీ వాటాలు వేసుకున్నారు."

"అంటే!! ??"

"నేను పెద్దవాడి యింట్లో ఆరునెలలు వుంటాను. అప్పుడు మీ వదినగారు చిన్నవాడి యింట్లో ఉంటారు. నేను చిన్నవాడి యింటికి వస్తే, ఆమె పెద్దవాడి యింటికి వెళుతుంది."

"ఎవరు ఏ యింటిదగ్గర ఉన్నా రాజపూజ్యం కదా? బావగారూ?" అడిగారు సుందరం మాష్టారు.

"నా జాతకంలో రాజ్యపూజ్యం తక్కువ అవమానం ఎక్కువ."

"చాల్లేండి అన్నయ్యగారూ..."

"అవునమ్మా! నేను పెద్దవాడి ఇంట్లో ఉన్నంతకాలం మనమల్ని కారులో తీసుకుపోయి కాన్వెంటుల్లో దిగబెట్టాలి. కూరగాయలు తేవాలి. ఒకవేళ పనివాళ్ళు సెలవు పెడితే ఆ బాధ్యతలు నామీద పడతాయి. చిన్నవాడి యింట్లో అన్ని పనులు నావే. మీ వదిన నేను ముచ్చటగా మూడుసార్లు కలుస్తాం. సంక్రాంతికి, ఉగాదికి, దసరా పండుగలకు. అప్పుడు మీ వదిన, నేను కష్టం సుఖం మాట్లాడుకుంటాం" అంటూ అరదావిలా కన్నీరు బొటబొట కారుతుంటే తువ్వాలుతో కన్నీరు వత్తుకున్నాడు జయరామయ్య.

అది చూసిన అలివేలు కన్నీరు తిప్పుతూ "క్షమించండి అన్నయ్యగారు! యింత అగ్నిగుండం మీ గుండెల్లో ఉందని నాకు తెలియదు" అంటూ చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

"కనీసం నీవైనా నా బాధలు అర్థం చేసుకున్నావు నా మనసు కుదుట పడిందమ్మా!" సంతోషంగా అన్నాడు జయరామయ్య.

సుందరం మాష్టారి గుండె బాధగా మూలిగింది.

"వస్తాను బావగారూ" అంటూ జయరామయ్య లేచాడు.

వీధి మలుపువరకు సుందరం మాష్టారు, అలివేలు సాగనంపారు.